

'ప్రభుత్వ వైద్యం పట్ల అవగాహన కల్పించాలి'

నిర్మల్ అర్బన్, సెప్టెంబరు 5 : ప్రభుత్వమే ప్రభుత్వ వైద్యం పట్ల అవగాహన కల్పిస్తూ, అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చూడాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్ అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కమిటీ సభ్యులు సందర్శించి పరిశీలించారు. ఆసుపత్రి 55 వేల మందికి సేవలందించేలా ఏర్పాటు చేసి అక్కడ కేవలం ఒక డాక్టర్, సిబ్బందితో నడిపించడంపై ప్రభుత్వ నిర్లక్ష్యం అని అన్నారు. అగ్రకుల ప్రయివేట్ ఆసుపత్రులను ప్రోత్సహించడానికే ప్రభుత్వ ఆసుపత్రి వ్యవస్థలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. బంగల్‌పేట్ ఆసుపత్రిలో అత్యాధునిక మైన సౌకర్యాలన్నీ కల్పించి, సరిపోయే సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు.



ఇటీవల భారీగా వరద నీరు రావడంతో కడెం ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్న దృశ్యం

ముందుచూపుతో ముంపునకు చెక్



ఇటీవల ప్రాజెక్టు 18 గేట్లు ఎత్తడంతో పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే బొజ్జు

- కడెం ప్రాజెక్టులోకి వరద నీరు చేరే ఆరు గంటల ముందే వరద ఉధృతి అలర్ట్
- రెయిన్ గేజ్ సెంటర్ల పనితీరుతో అప్రమత్తమయిన అధికారులు
- అధునాతన సిస్టంతో సిద్ధమైన అన్ని గేట్లు
- గత రెండేళ్లు వరుసగా డేంజర్ బెల్స్
- ఈ ఏడాది భారీ వరదను తట్టుకుని సురక్షితంగా నిలిచిన కడెం ప్రాజెక్టు
- భారీగా వరద నీరు వచ్చినా అవలీలగా దిగువకు
- ప్రాజెక్టుకు ఇక అన్నీ మంచిరోజులేనని ఆయకట్టు రైతుల్లో సంబరం

ఖానాపూర్, సెప్టెంబరు 5 : గత రెండేళ్లుగా భారీ వర్షాలు కురిశాయంటే చాలు ప్రాజెక్టు ఉంటుందో తెగిపోతుందోననే విధంగా వరుసగా రెండేళ్లుగా డేంజర్ బెల్స్ మోగించిన కడెం ప్రాజెక్టుకు ఇక మంచిరోజులు వచ్చాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత రెండు, మూడేళ్లుగా ఉన్న పళంగా గంటల వ్యవధిలోనే అట్టడుగున ఉన్న నీటిమట్టం అమాంతం పెరిగి కడెం ప్రాజెక్టు నిండుకుండలా ఎప్పుడు మారుతుందో అని కబురు వచ్చి సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటూ వెళ్లాల్సి వస్తుందోననే ఆందోళన చెందే 12 గ్రామాల ప్రజల్లో ఇక అభద్రతా భావం తొలగిపోయినట్లే. కడెం ప్రాజెక్టును ఆధునీకరించేందుకు తెలంగాణలో రేవంత్ సర్కారు ఏర్పడిన వెంటనే నిధులు మంజూరు చేసింది. కడెం ప్రాజెక్టు వద్ద ఉన్న ఫలంగా వరద ఉధృతి పెరుగుతుండడంతో ఆధునాతన సాంకేతికపద్ధతిని ఉపయోగించి ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటిని ముందుగానే పసిగట్టే విధంగా రెయిన్ గేజ్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రాజెక్టులోకి వచ్చే వరద ఉధృతిని ఆరు గంటల ముందే తెలుసుకుంటున్నారు.

ముందు చూపుతో నిర్మించిన ప్రాజెక్టు

ఎన్నో చిన్నచిన్న వాగులు, ఒర్రెలను తనలో కలుపుకుంటూ జిల్లాలో దాదాపు 86 కిలోమీటర్లు ప్రవహించి గోదావరినదిలో కలుస్తుందీ వాగు. ఆరు కిలోమీటర్ల ఎగువభాగంలో కడెంవాగుపై చుట్టూ ఎత్తైన కొండల నడుమ 1969లో ప్రాజెక్టు నిర్మించారు. అప్పటి నుంచి గత ఏడాది వరకు ఎన్నో వరద ఉధృతులను తట్టుకొని నాటి నిర్మాణం ప్రతిష్ఠతను చాటుతూ నిలబడింది. వరుసగా గత రెండేళ్లుగా ప్రాజెక్టుపై నుంచి నీరు ఓవర్‌ఫ్లో అయ్యి ప్రవహించింది. ఈ దశలో ప్రాజెక్టు తెగిపోతుందని అంతా భావించినప్పటికీ కడెం ప్రాజెక్టు సురక్షితంగా వరదల నుంచి బయటపడింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 700ల అడుగులు కాగా పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 7.600ల టీఎంసీలు.. ప్రాజెక్టుకు 18 గేట్లను నిర్మించారు. ఈ 18 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదిలితే 3 లక్షల 20 వేల క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రాజెక్టు నుంచి బయటకు వెళ్తుంది. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు 5 లక్షల పైగా క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చింది. సుమారు 457 మీటర్ల ఎత్తు నుంచి ఎత్తైన కొండలు గుట్టల ద్వారా కడెం ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో గంటల వ్యవధిలోనే ప్రాజెక్టు నిండుకుండలా మారుతుంది. దీంతో కడెం ప్రాజెక్టు ఎప్పుడు నిండుతుందో అంచనా వేయలేక గత ఏడాది వరకు అధికారులు సతమతమయ్యారు. కానీ నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్టులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మూడు ప్రాజెక్టులకు ఎగువన రెయిన్‌గేజ్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రూ.5 కోట్లను వెచ్చించింది. అందులో భాగంగానే కడెం ఎగువ ప్రాంతంలో మూడు రెయిన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ రెయిన్‌గేజ్ కేంద్రాల ద్వారా వరదను ముందస్తుగా గుర్తిస్తున్నారు. కడెం ప్రాజెక్టు ఎగువ భాగంలోని ఇటిక్యాల్ వంతెన వద్ద మందపల్లి వంతెన వద్ద కడెంవాగుపై, చీకుమాన్ వాగుపై సత్తగూడ వద్ద మూడు రెయిన్‌గేజ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మరొకటి దిగువన పాండ్వాపూర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ముందస్తుగా వచ్చే వరద ఉధృతిని ఈ గేజ్ కేంద్రాలు పసిగట్టడంతో ప్రస్తుతం ఏడాది కడెం ప్రాజెక్టులోకి వచ్చే భారీ వరదను ముందస్తుగానే గుర్తించారు. దీంతో కడెం, కన్నాపూర్, కొండుకూర్, బెల్లాల్, పాండ్వాపూర్, అంబారిపేట్, డ్యాం గూడా, దేవునిగూడెం, రాంపూర్, భూత్కూర్, మున్యాల్, గొడిసిర్యాల్ గ్రామాల ప్రజలు గ్రామాలను ఖాళీ చేయాల్సిన ఆకస్మిక పరిస్థితులు తప్పినట్లు అధికారులు చెబుతున్నారు.

రెయిన్‌గేజ్ కేంద్రాలతో వరద ముంపుపై ముందే అలర్ట్

వరుసగా గత రెండేళ్ల కడెం ప్రాజెక్టు వరద ఉధృతికి ఓవర్ ఫ్లో అయిన నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన వెంటనే రేవంత్ సర్కారు కడెం ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాజెక్టులోకి వచ్చే వరద నీటిని 6 గంటల ముందే గుర్తించే విధంగా ప్రాజెక్టు ఎగువన రెయిన్‌గేజ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ రెయిన్ గేజ్ కేంద్రాలు వరద నీటిని ముందుగానే పసిగట్టేలా పని చేస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. కడెం ప్రాజెక్టు ఎగువన ఇటిక్యాల్ వంతెన, మందపల్లి వంతెన, సత్తుగూడ మూడు ప్రాంతాల్లో ఈ రెయిన్‌గేజ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల నుండి వచ్చే నీటి ఉధృతిని లెక్కకట్టి వెంటనే ప్రాజెక్టు అధికారులకు అప్రమత్తం చేసేలా ఈ రెయిన్ గేజ్ కేంద్రాలు మెసేజ్‌లు పంపుతున్నట్లు చెబుతున్నారు. దీంతో వచ్చే వరద తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టులో ఉన్న నీటిని బయటకు పంపేందుకు అధికారులకు వెసులుబాటు లభించినట్లు చెబుతున్నారు. తద్వారా ప్రాజెక్టు పైనుంచి నీరు ఓవర్ ఫ్లో అయ్యే ప్రమాదం పూర్తిగా నివారించామని చెబుతున్నారు. ఎగువన నిర్మించిన ఈ మూడు గేజీ కేంద్రాలతో పాటు ప్రాజెక్టు దిగువన పాండ్వాపూర్ వంతెన వద్ద మరో గేజ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో దిగువన ఏర్పాటు చేసే గేజ్ కేంద్రంతో ప్రాజెక్టు నుండి దిగువకు వెళ్లే వరద నీటి ఉధృతిని తెలుసుకొని కింద ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులను ఈ గేజ్ కేంద్రం అలర్ట్ చేస్తున్నట్లు చెబుతున్నారు.

అందుబాటులోకి వచ్చిన స్కాడ ఆటోమేటిక్ గేట్ సిస్టం

ప్రాజెక్టు నిండుకుండలా మారిన క్రమంలో ప్రాజెక్టు నుంచి నీటిని దిగువకు వదిలేందుకు స్కాడ ఆటోమేటిక్ గేట్ సిస్టం అందుబాటులోకి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది ప్రాజెక్టు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నప్పుడు గేట్లు మొరాయించిన నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వం మరమ్మతుల కోసం సుమారు రూ.10 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రాజెక్టుగేట్లు మరమ్మతు సహా ఇతరత్రా పనులను పూర్తి చేసి ప్రాజెక్టును సిద్ధం చేశారు. దీంతో గత ఏడాది పరిస్థితులు పునరావృతం కాకుండా రెండు విధాలుగా ఆపరేటింగ్ చేసేలా ఆటోమేటిక్ గేట్‌సిస్టంను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు. మాన్యువల్ పద్ధతితో పాటు కంట్రోల్‌రూమ్‌లోనే ఉంటూ 18 గేట్లను ఆపరేటింగ్ చేసేలా ఆటోమేటిక్ సిస్టం సైతం కడెం ప్రాజెక్టు వద్ద అందుబాటులోకి తెచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది సైతం మూడు లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చినప్పటికీ ముందస్తుగానే రెయిన్‌గేజ్ కేంద్రాలు అప్రమత్తం చేయడంతో విజయవంతంగా ప్రాజెక్టులోని వరద నీటిని దిగువకు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. ఇటీవల ప్రాజెక్టు 18 గేట్లు ఎత్తడంతో రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిలలు ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ప్రాజెక్టు 18 గేట్లు తెరిచి నీటిని దిగువకు పంపి తిరిగి గేట్లను విజయవంతంగా దింపడంతో కడెం ప్రాజెక్టు పూర్వ వైభవాన్ని సంతరించుకున్నట్లు చెబుతున్నారు.

సంతోషంలో ఆయకట్టు రైతాంగం

వరుసగా గత రెండు, మూడేళ్లుగా కడెం ప్రాజెక్టు డేంజర్‌బెల్స్ మోగించడంతో పంటలను కోల్పోయిన ఆయకట్టు రైతాంగం ప్రస్తుతం ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేసుకుని పూర్వవైభవం సంతరించుకోవడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై తమకు రెండు పంటలకు సాగునీటికి ఢోకా ఉండదని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు మరమ్మతుల కోసం ప్రభుత్వం నుండి నిధులు తెచ్చేందుకు శ్రమించిన స్థానిక శాసనసభ్యులు వెడ్మ బొజ్జు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కలపై రైతులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఖానాపూర్, మంచిర్యాల నియోజకవర్గాలలో సుమారు 68 వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు తిరిగి సాగులోకి రానున్నాయి

ప్రభుత్వం మరమ్మతులకు నిధులు మంజూరు చేయడంతో ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద ఆధునాతన పద్ధతిన గేట్ల ఆపరేటింగ్ సిస్టం అందుబాటులోకి వచ్చిందని కడెం ప్రాజెక్టు ఏఈఈ రవినాయక్ తెలిపారు. రెయిన్ గేజ్ కేంద్రాలు అద్భుతంగా పనిచేస్తున్నాయన్నారు. ఈ ఏడాది భారీ వరదలు వచ్చినా విజయవంతంగా వరదనీటిని దిగువకు పంపించాం.

అమృత్ 2 పథకం కింద రూ.62 కోట్ల మంజూరు



స్మశానవాటికను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 5 : నిర్మల్ పట్టణ ప్రజలకు మంచినీటి సరఫరా కోసం గాను అమృత్ 2 పథకం ద్వారా 62 కోట్లు మంజూరైనట్లు మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ తెలిపారు. గురువారం పట్టణంలోని వినాయక్ నగర్, పీజీ సెంటర్, సోఫీనగర్, స్మశాన వాటిక ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగా మూడు మంచినీటి ట్యాంకుల నిర్మాణం జరుగుతుందన్నారు. పట్టణంలో పైప్‌లైన్ పనుల మరమ్మతు చేయనున్నట్లు తెలిపారు. కమిషనర్ రాజు, ఆదిలాబాద్ ఈఈ గంగాధర్, డీఈ సంతోష్ జాదవ్, ఏఈలు, టౌన్ ప్లానింగ్ అధికారి ఆయన వెంట ఉన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి : సీపీఐ



నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 5 : పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సీపీఐ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా గురువారం నిర్మల్‌లో ఆ పార్టీ నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు ఎస్ఎన్ రెడ్డి, విలాస్ మాట్లాడుతూ.. మోదీ నాయకత్వంలోని కేంద్రం గత పదేళ్లుగా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెంచిందని ఆరోపించారు. జనగణన చేపట్టకపోవడంతో పథకాలు అర్హులకు అందడం లేదన్నారు. జనగణన చేపట్టాలని, వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భుక్యా రమేష్, నాయకులు పాల్గొన్నారు.

వినాయక చవితి వేడుకలకు ప్రణాళికబద్ధమైన ఏర్పాట్లు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిమజ్జనోత్సవ శోభాయాత్ర మార్గాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

భైంసా, సెప్టెంబరు 5 : వినాయక చవితి వేడుకలకు లోపాలకు తావులేకుండా ప్రణాళికబద్ధమైన రీతిలో ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ భైంసా పట్టణ పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖాధికారులకు సూచించారు. గురువారం పట్టణ పరిధిలో వినాయక చవితి వేడుకల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం నిర్వహించే గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద, పట్టణ పరిధిలో నిమజ్జనోత్సవ శోభయాత్ర కొనసాగే మార్గాన్ని క్షేత్ర స్థాయిలో పర్యటించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, పోలీసు అధికార యంత్రాంగానికి వినాయక చవితి వేడుకల నిర్వాహణ వ్యవస్థ, ఏర్పాట్ల పై పలు సూచనలు, సలహాలు, ఆదేశాలు జారీ చేశారు. శోభయాత్ర కొనసాగే మార్గంలో ఎలాంటి సమస్యలు ఏర్పకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ప్రభుత్వ శాఖాధికారులు సమన్వయంతో సమిష్టిగా వ్యవహరించాలన్నారు. రోడ్లపై గుంతలు పూడ్చివేయాలన్నారు. ఎక్కడ కూడా విద్యుత్ తీగలు వేలాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గడ్డెన్నవాగు ప్రాజెక్టు వద్ద నిమజ్జనోత్సవ ప్రక్రియలు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పటిష్ఠ బందోబస్తు చర్యలు తీసుకోవాలన్నారు. క్రేన్లు, విద్యుత్ వ్యవస్థ, జనరేటర్లు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఆద్యాంతం అధికారులంతా అప్రమత్తతతో వ్యవహరిస్తూ బాధ్యతాయుతంగా విధులు చేపట్టాలన్నారు. ఇందులో ఏఎస్పీ అవినాష్ కుమార్, ఆర్డీవో కోమల్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ రాజేష్ కుమార్, ట్రాన్స్‌కో ఏఈ మోహన్ కుమార్‌తో పాటు ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన రీతిలో వైద్య సేవలు అందించాలి

వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు సకాలంలో సత్వరంగా మెరుగైన రీతిలో వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. గురువారం ఇక్కడి ఏరియా ఆసుపత్రిలో తనిఖీలు చేపట్టారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలలో పర్యటించి పరిశీలనలు చేపట్టారు. వివిధ విభాగాలకు సంబంధించిన నిర్వాహణ రికార్డులను పరిశీలించారు. ఆయా వార్డుల లో చికిత్సలు పొందుతున్న రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏరియా ఆసుపత్రి డా.కాశీనాథ్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. నిర్వాహణ వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరచాలన్నారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. మందుల కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.అందరూ సమయపాలన విధిగా పాటిస్తూ బాధ్యతాయుతంగా వైద్య సేవలు అందించాలన్నారు. విధుల నిర్వాహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఆసుపత్రి అవరణంలో వాహనాల నిలుపుదల లేకుండా చూడాలని సూచించారు.పరిశుభ్రతపై అధిక ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు.

ట్రిపుల్ ఐటీలో కొనసాగుతున్న ఆందోళనలు

- రెండవ రోజు విద్యార్థుల నిరసన
- భారీ ర్యాలీ
- విద్యార్థులపై అధికారుల ఒత్తిడి
- చర్యలు తప్పవంటూ నోటీసు జారీ చేసిన అధికారులు



ట్రిపుల్ ఐటీలో రెండోరోజు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బాసర, సెప్టెంబరు, 5 : సమస్యల పరిష్కారం కోసం బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. రెండవరోజు గురువారం సుమారు 2 వేల మంది విద్యార్థులు యూనివర్సిటీ ప్రాంగణంలో భారీ ర్యాలీ ప్రదర్శించారు. అనంతరం మేన్ గేటు వద్ద బైటాయించి ఆందోళనకు దిగారు. ప్రస్తుతం ఉన్న అధికారులను మార్పు చేసి రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్‌ను నియమించాలనే ప్రధాన డిమాండ్‌తో ఆందోళన చేపడుతున్నారు. గతంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిన సందర్భాలు ఉండడంతో అలాంటి పరిస్థితి తలెత్తకుండా అధికారులు ఆందోళనను విరమించేలా విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నారు. గురువారం కొంత మంది విద్యార్థులను పిలుచుకొని ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వర కు చర్చలు జరిపారు. అయినా విద్యార్థులు సమస్యల పరిష్కారం కోసం పట్టు బట్టారు. సమస్యల పరిష్కారం కోసం గత రెండు నెలల నుంచి వైస్ చాన్స్‌లర్‌ను కలవడానికి ప్రయత్నిస్తే ఇప్పటి వరకు టైము ఇవ్వడం లేదని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వంటి ఉన్నతమైన వ్యక్తి తమకు అపైట్‌మెంట్ ఇచ్చి సమస్యలు తెలుసుకున్నాడు గాని వైస్ చాన్స్‌లర్ మాత్రం టైమ్ ఇవ్వకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి విద్యార్థులు వినకపోవడంతో అధి కారులు ఒక నోటీసును జారీ చేశారు. యూనివర్సిటీలో ఆందోళన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని అందులో హెచ్చరించారు.

నిబంధనలు అతిక్రమిస్తే మండపాల నిర్వాహకులపై చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై సుమలత

లక్ష్మణచాంద, సెప్టెంబరు 5 : నిబంధనలు అతిక్రమిస్తే గణేష్ మండపాల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై సుమలత హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయా గ్రామాల్లోని గణేష్ మండపాల నిర్వాహకులు, యువకులు తప్పనిసరిగా పోలీసు వారి అనుమతి తీసుకోవాలని, శాంతి సామరస్యంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాన్ని జరుపుకోవాలన్నారు. మండపాల వద్ద షార్ట్ సర్క్యూట్ జరగకుండా చూసుకోవాలని, రోడ్డు పక్కన ఉన్న మండపాల వారు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకూడదన్నారు. నిమజ్జనం రోజు భారీ డీజేలు, స్పీకర్లు పెట్టరాదని తెలిపారు. తగిన సమయంలో ఊరేగింపు ముగించుకొని నిమజ్జనం చేసుకోవాలన్నారు. ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఏమైనా దుస్సంఘటనలకు పాల్పడినటో వారిపై చట్టరీత్యా చర్య తీసుకోబడునని హెచ్చరించారు. ఇప్పటి వరకు లక్ష్మణచాంద మండలంలో గణేష్ ఉత్సవాల సమయంలో ఎలాంటి దుస్సంఘటనలు జరగలేదని, ప్రతి గ్రామానికి మంచి పేరు ఉందని ఈసారి కూడా అన్ని గ్రామస్తులు శాంతి సామరస్యంతో పండుగను జరుపుకొని ఆ పేరును నిలబెట్టుకోవాలన్నారు. ఇలాంటి పోస్టుల పైన, ఏదైనా ప్రాబ్లం ఉన్నా వెంటనే పోలీసులు వారికి తెలియపరచాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా లక్ష్మణచాంద మండల తహసీల్దార్ జానకి, ఎంపీడీవో రాధా రాథోడ్‌లు హాజరయ్యారు. ఆయా గ్రామాల గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

గంజాయి అమ్ముతున్న ఇద్దరి అరెస్ట్



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 5 : నిర్మల్‌లో గంజాయి అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ... గంజాయి అమ్ముతున్నట్లు ముందస్తు సమాచారం మేరకు పట్టణ ఎస్సై రమేష్ సిబ్బందితో కలిసి మంచిర్యాల చౌరస్తాలో గల చాచా టీ సెంటర్ వద్ద చావుస్ అబ్రార్, షైక్ రఫాయ్‌లు ఓ ప్లాస్టిక్ కవర్‌లో అమ్మేందుకు వెళ్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారిద్దరిని విచారించగా మొహమ్మద్ అయాన్ అనే మిత్రుడు వారితో కలిసి గంజాయి అమ్ముతున్నామని తెలిపారన్నారు. భైంసాకు చెందిన బారీ అనే వ్యక్తి వద్ద కొని అమ్ముతున్నట్టు తెలిపారన్నారు. నిందితుల నుంచి 1.200 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. నిర్మల్‌లో ఎవరైనా గంజాయి అమ్మినట్లయితే తెలపాలని వారి పేర్లు రహస్యంగా ఉంచుతామని డీఎస్పీ తెలిపారు.

మత్తు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 5 : డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ సూచించిన నిబంధనలు పాటించి మత్తు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని మెడికల్ దుకాణాలు, ఏజెన్సీలను జిల్లా అధ్యక్షుడు సాధం అరవింద్ కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ... హెచ్- 1 రిజిస్టర్ తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. హ్యాబిట్ ఫార్మింగ్, నార్కోటిక్ డ్రగ్స్ అమ్మకాలు రిజిస్టర్‌లో పొందుపరిచి వైద్యుల ప్రిస్క్రిప్షన్ మేరకు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ నేరెళ్ల ప్రమోద్, కోశాధికారి బద్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు ఉద్యమకారుల ఫోరం సమావేశం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 5 : తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర చైతన్య యాత్ర సన్నాహక సమావేశం సందర్భంగా శుక్రవారం ఉదయం 11 గంటలకు టీఎన్జీవో భవన్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా చైర్మన్ కొట్టే శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యమకారులు నాటి ఉద్యమ పత్రికా ఫోటోలు, పోలీసు కేసుల వివరాలతో హాజరుకావాలని కోరారు. చైతన్య యాత్ర రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం చైతన్య యాత్ర నిర్మల్ చేరుకోనున్నందని తెలిపారు. ఉద్యమకారులు పెద్దఎత్తున హాజరుకావాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కుంటాల, సెప్టెంబరు, 5: మండల కేంద్రం కుంటాలకు చెందిన అంజనాబాయి (60) గురువారం మృతి చెందింది. ఈమెకు ఒక్కగానొక్క కుమారుడు ఉన్నారు. అతను ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తాడు. నిరుపేద కుటుంబం కావడం, ఇతని తండ్రి ఇటీవల మృతి చెందారు. అంత్యక్రియల కొరకు గ్రామస్థులు తలా కొంత జమ చేసి రూ. 50 వేలకు పైగా ఆర్థిక సాయం అందజేశారు.

ఆదివాసీ మహిళల పై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలి

ఉట్నూర్, సెప్టెంబరు 5: ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజన మహిళల పై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలని ఆదిమ గిరిజన కోలాం సేవా సంఘం మండల అధ్యక్షుడు సిడాం బాపురావు డిమాండ్ చేశారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోజు రోజుకు జరిగిన ప్రాంతాలలో ఆదివాసీ మహిళల పై లైంగిక దాడులు, అత్యాచార యత్నాలు, ఆత్యాయత్నాలు జరుగుతున్నందున దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

తలమడుగు, సెప్టెంబరు 5 : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని మండలంలోని ఆయా పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాలను బోధించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకున్నారు. ఈ సందర్భంగా తలమడుగు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు మహనీయుల స్ఫూర్తితో ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం తలమడుగు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు రాకేష్‌కు ఉత్తమ ఉపాధ్యాయుడుగా రావడంతో ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్ : భారతదేశ మొదటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని మండలంలోని పలు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మండలంలోని సాలెవాడ(బి) ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుచంద్రకాంత్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నీలిమా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైంది

● ఎంపీడీవో రాధా రాథోడ్

లక్ష్మణచాంద, సెప్టెంబరు 5 : ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైందని ఎంపీడీవో రాధా రాథోడ్ గురువారం అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకొని పీచరలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లక్ష్మణచాంద మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయుల దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అన్ని వృత్తులలో కంటే ఉపాధ్యాయ వృత్తి చాలా గొప్పదన్నారు. విద్యార్థులంతా ప్రణాళిక ప్రకారం చదివి అనుకున్న లక్ష్యాలను సాధించి ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని అభిలాషించారు. కేజీబీవీ, పీచర ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అలాగే కనకాపూర్, పీచర, ధర్మారం గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి భారీ వర్షాల రీత్యా పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, పారిశుద్ధ్య కార్మికులకు, వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాధా రాథోడ్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నవిత, ప్రధానోపాధ్యాయులు సాయికృష్ణ, ఎంపీవో అమీర్ ఖాన్, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు


ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న ఎంపీడీవో రాధా రాథోడ్

కుల వృత్తులపై అవగాహన

ఇచ్చోడ, సెప్టెంబరు, 5: పట్టుకొమ్మలు పల్లెలని, ఆధునిక నాగరికతలో కనుమరుగవుతున్న కులవృత్తులు, వారి పనిముట్లు తదితర అంశాలపై పాఠశాల విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఇచ్చోడ మండలంలోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాల విద్యార్థులు గురువారం ముక్రా(కె) గ్రామాన్ని సందర్శించారు. అసలు గ్రామాలు ఏలా ఉంటాయి.. గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏలాంటి పనిచేస్తారు. కులవృత్తుల వారి పనులను, రైతుల పనులను దగ్గరుండి ఆలకించారు. ముక్రా(కె)లో వ్యర్థ పదార్థలతో తయారు చేస్తున్న సేంద్రియ ఎరువుల తయారీ, పాఠశాలలో కిచ్చన్ గార్డెన్, సాముహిక టాయిలెట్, హరితవనంను సందర్శించి గ్రామీణులు వారి జీవన విధానం గుర్చి అవగాహన కల్పించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మన్న

అంగన్‌వాడీని సందర్శించిన సూపర్‌వైజర్

భీంపూర్ , సెప్టెంబరు 5 : పోషణ మాసంలో భాగంగా గురువారం భీంపూర్ ఐసీడీఎస్ సూపర్ వైజర్ ముంతాజ్ మండలంలోని అంతర్గం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి పిల్లల బరువును పరిశీలించారు. ఇంటింటా తిరుగుతూ గర్భిణులకు పలు జాగ్రత్తలు సూచించారు. ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్ సవాయి పుష్పాంజలి, ఆశ గంగు బాయి తదితరులు ఉన్నారు.

కంప్యూటర్‌ను బహూకరించిన పూర్వ విద్యార్థులు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 5 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 2002-03 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు రూ. 20 వేల విలువ గల కంప్యూటర్‌ను గురువారం బహుకరించారు. చదివిన పాఠశాలకు కృతజ్ఞతను చాటుతూ ఈ బహుమతిని అందజేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు ఉన్నారు.


కంప్యూటర్‌ను బహుకరిస్తున్న దృశ్యం

పత్తి పంటకు తీవ్ర నష్టం


పత్తి పంట

తాంసి, సెప్టెంబరు 5 : గత ఐదు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురు స్తున్న వర్షాలకు పంటలకు భారీ నష్టం వాటిల్లుతోంది. గురువారం ఉదయం సైతం వర్షం పడటంతో పంట పొలాల్లోకి మరింత వరద నీరు వచ్చి చేరు తుంది. దీంతో పత్తి పంట పెరుగుదల పూర్తి ఆగిపోగా పంటలు పంటలన్నీ జొకు పడుతున్నాయని రైతులు అంటున్నారు. గతంలో కంటే వ్యవసాయం ఈ ఏడు భిన్నంగా ఉందని అంటున్నారు. ఇప్పటి వరకు ఎకరానికి సుమారు 35 వేల రూపాయల వరకు ఖర్చు చేసినట్లు పేర్కొంటున్నారు. ఏ పత్తి పొలంలో చూసిన వర్షపు నీరు, వరద నీరు కనిపిస్తుందని అంటున్నారు. ప్రాజెక్టు సమీపంలో, వాగుల సమీపంలో ఉన్న పంట భూముల్లో అయితే ఇసుక మేటలు పెట్టి ఎందుకు పనికి రాకుండా మారాయి. తమను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ముథోల్, సెప్టెంబరు 5 : పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో శివకుమార్ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాలు పడుతున్న దృష్ట్యా ఎలాంటి వ్యా. దులు ప్రబలకుండా గ్రామ పంచాయతీలోని కార్యదర్శులు మురికి కాలువలు, మంచి నీటి ట్యాంకులు శుభ్రపర్చాలని సూచించారు. అలాగే బ్లీచింగ్ పౌడర్ వేయడం తితర చర్యలు చేపట్టాలన్నారు. అలాగే శుక్రవారం ప్రతి గ్రామ పం చాయతీలో ఓటరు లిస్టు అతికించాలన్నారు. అలాగే ఈజీఎస్ సోషల్ ఆడిట్ జరుగనున్న నేపథ్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లు రికార్డులను సంపూర్ణంగా పూర్తి చే యాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామ పంచాయతీల కార్యద ర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు పలు వివరాలు అడిగి సలహా సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శిరీష రెడ్డి, కార్యదర్శులు, తదితరులు ఉన్నారు.

లచ్చిరెడ్డి గొప్పలు చెప్పడం మానుకోవాలి : జేఏసీ

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 05 : డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షులు లచ్చిరెడ్డి తన ఒంటెద్దు పోకడ వీడి గొప్పలు చెప్పడం మానుకోవాలని ఆదిలాబాద్ జిల్లా ఉద్యోగ జేఏసీ చైర్మన్ సంద అశోక్ హితవు పలికారు. గురువారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భావన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరద సహాయం కింద ఉద్యోగులు మొత్తం కలిసి ఒకరోజు వేతనం కింద రూ.130 కోట్లు విరాళంగా ఇస్తే అదంతా తన ఘనతే అని చెప్పుకోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా లచ్చిరెడ్డి తన పద్ధతి మార్చుకోవాలన్నారు. సమావేశంలో జేఏసీ సభ్యులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది

● కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదల కారణ ంగా నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి అ న్నారు. గురువారం బేల మండలంలోని కొగ్దూరు, మణియార్‌పూర్, గూడ, బెదోడా, సాంగిడి గ్రామాలలో పర్యటించి రైతులకు భరోసా కల్పించారు. నష్టపోయిన రైతులందరికి ప్రభుత్వం ఆదుకుంటుందని హామీనిచ్చారు. మరికొద్ది రోజుల్లోనే చేతికి వచ్చే పంటను వరద నీరు ముంచెత్తడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని అన్నారు. నష్టపోయిన అన్నదాతను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. త్వరలోనే అధికారులు పంటలను సర్వేచేసి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ప్రతిపక్షాలు చెప్పే కల్లిబొల్లి మాటలను నమ్మి రైతులు ఆందోళనకు గురికావద్దన్నారు. ఆయనవెంట ఫైజుల్లాఖాన్, రాందాస్,సంజయ్, సామ రూపేష్‌రెడ్డి, బండిసుదర్శన్, లోక ప్రవీణ్‌రెడ్డి, డేరా కృష్ణారెడ్డి, మంగేష్, శ్రీనివాస్, వినోద్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న అదనపు డీజీ

జైనూర్ ఘటనపై ప్రజలు సంయమనం పాటించాలి

● అదనపు డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్‌భగవత్

ఉట్నూర్, సెప్టెంబరు 5: జైనూర్‌లో జరిగిన ఘటనపై ప్రజలందరూ సంయమనం పాటించాలని అదనపు డీజీ (లాఅండ్‌ఆర్డర్) మహేశ్ భగవత్ కోరారు. గురువారం ఐజీ చంద్రశేఖర్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, జగిత్యాల, సిరిసిల్లా, ఆదిలాబాద్‌జిల్లాల ఎస్పీలు అశోక్‌కుమార్, అఖిల్‌మహాజన్, గౌస్‌ఆలం, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి, బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్‌లతో కలిసి ఓ వర్గం మత పెద్దలతో, ఉట్నూర్‌లోని కొమురంభీం కాంప్లెక్స్‌లో ఆదివాసీ పెద్దమనుషులతో వేర్వేరు జైనూర్ ఘటనపై సంయమనం పాటించాలని కోరుతూ సమావేశం నిర్వహించారు. అనంతరం ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణంలో విలేకరులతో అదనపు డీజీ (లాఅండ్‌ఆర్డర్) మహేశ్ భగవత్ మాట్లాడుతూ జిల్లాలోని జైనూర్‌లో ఓ మహిళపై దాడి జరగడం బాధాకరమని అన్నారు. బాధిత మహిళలకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని, వైద్యచికిత్స ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, కుటుంబ సభ్యులు సహకరించాలని తెలిపారు. ఈ ఘటనలో జరిగిన ఆస్తినష్టంపై పూర్తిస్థాయి నివేదిక అందించేందుకు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించినట్లు చెప్పారు. జరిగిన నష్టంపై పారదర్శకమైన నివేదిక అందించాలని, తద్వారా బాధితులకు నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్‌దోత్రే మాట్లాడుతూ బాధిత మహిళపై లైంగిక వేధింపులు, హత్యాయత్నానికి పాల్పడిన సందర్భంలో తుడందెబ్బతో సహా ఆదివాసీ సంస్థలు బంద్ పిలుపునివ్వగా బంద్‌ను బాధ్యతాయుతంగా నిర్వహించేందుకు రెండువర్గాలతో చర్చించామన్నారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు మొత్తం వెయ్యి మందికి పైగా పోలీసులను మోహరించారని ఆర్ఏఎఫ్ మోహరింపబడుతుందని, రాష్ట్ర డీజీపీ, ఏడీజీ (లాఅండ్‌ఆర్డర్) నార్త్‌జోన్ ఐజీనిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని, నిషేధిత కర్ఫ్యూ ఆదేశాలు 144 సీఆర్‌పీసీ /163 బీఎన్‌ఎస్‌ఎస్ జిల్లా యంత్రాంగం జారీ చేసిందని, నిషేధాజ్ఞలను ఉల్లంఘించవద్దని తెలిపారు. మహిళపై హత్యాయత్నం, లైంగిక వేధింపుల కేసులో ఇప్పటికే నిందితుడిని జైనూర్ పోలీసులు అరెస్టుచేసి జ్యూడిసియల్ కస్టడికి తరలించినందున అందరూ సంయమనం పాటించాలని కోరారు. గాంధీ ఆసుపత్రిలో బాధితురాలికి వైద్యచికిత్స కొనసాగుతుందని, అన్నిచికిత్స ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని, బాధితురాలకి ఇప్పటికే రూ.లక్ష పరిహారం అందించడం జరిగిందని తెలిపారు. వదంతులను నమ్మవద్దని, ఎలాంటి నిజం లేకుండా రెచ్చగొట్టే సోషల్ మీడియాపోస్టులను ప్రసారం చేస్తే శిక్షార్హమైన చర్య తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాలలో సంబంధిత అధికారులు ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా, తదితరులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపుల కేసులో భర్తకు ఏడేళ్ల జైలు శిక్ష

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు5: వరకట్న వేధింపుల కేసులో భర్త షేక్ అయ్యూబ్‌కు ఏడేళ్లజైలు శిక్ష విధిస్తూ ఆదిలాబాద్ జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావ్ గురువారం తీర్పునిచ్చారు. ఖానాపూర్‌కు చెందిన షేక్ ఆయూబ్ వివాహం 2021లో ఖుర్షీద్ నగర్‌కు చెందిన షేక్ సైదాతో జరిగింది. అదనపు కట్నం తీసుకురావాలంటూ భార్య షేక్ సైదాను తరచూ మానసికంగా, శారీరకంగా వేధించడంతో ఆమె 2022 మే 6న రైలు పట్టాలపై పడుకొని రైలు ఢీకొనడంతో మృతిచెందింది. నేరం రుజువు కావడంతో నేరస్తునికి జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

వేగంగా రైతు కుటుంబాల నిర్ధారణ సర్వే

ఇచ్చోడ, సెప్టెంబరు5: రుణమాఫీ కాని రైతు కుటుంబాల నిర్ధారణ సర్వే జిల్లాలో వేగంగా కొనసాగుతోందని జిల్లా వ్యవసాయాధికారి కైలాష్ అన్నారు. మండలంలోని ముక్రా(కె) గ్రామంలో కొనసాగుతున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. రుణాలు మాఫీకాని అర్హులైన రైతులు ఆందోళన చెందవద్దని ఆయన కోరారు.



నార్నూర్ మండలంలో పోలీసు బందోబస్తు



ఇంద్రవెల్లిలో పోలీసు బందోబస్తు

ఆదిలాబాద్ ఏజెన్సీలో హైటెన్షన్

ఆదిలాబాద్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి) /ఉట్నూర్, నార్నూర్: ఆదిలాబాద్ ఏజెన్సీలో ఇంకా హైటెన్షన్ కన్పిస్తోంది. ఇరువర్గాల మధ్య చెలరేగిన వివాదంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. ఆసిఫాబాద్ కొమురంభీం జిల్లా జైనూర్ మండలంలో జరిగిన అత్యాచారయత్నం ఘటన దృష్ట్యా ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులు గురువారం భారీ బందోబస్తును ఏర్పాటుచేశారు. ముఖ్యంగా ఇంద్రవెల్లి, ఉట్నూర్, నార్నూర్, గాదిగూడ మండలాల్లో 144సెక్షన్‌ను విధించారు. అనుమతులు లేకుండా ర్యాలీలు, సభలు, సమావేశాలు ఏర్పాటు చేయరాదంటూ హెచ్చరికలు జారీచేశారు. ఏజెన్సీ మండలాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఎలాంటి హింసాత్మక ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జైనూర్ వెళ్లేందుకు ప్రయత్నించిన ఆదిలాబాద్ ఎమ్మెల్యేపాయలశంకర్, పలువురు బీజేపీ నేతలను హౌజ్ అరెస్టుచేసి అదుపులోకి తీసుకున్నారు. ఉట్నూర్‌లోని హస్నాపూర్ చౌరస్తాతోపాటు పూసిగూడ చౌరస్తాలో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లావైపు వెళ్లేందుకు ఎవరిని అనుమతించలేదు. ద్విచక్ర వాహనాలతో పాటు, కార్లు, జీపులు ఆటోలలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్‌మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచాయి. ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లేబస్సు సర్వీసులనుఆర్టీసీ అధికారులు రద్దుచేశారు. కవరేజ్ కోసం జైనూర్‌కు వెళ్లేందుకు మీడియాకు కూడా అనుమతించ లేదు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ఆదిలాబాద్‌రూరల్, సెప్టెంబరు 5: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై దాడి చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి డిమాండ్‌చేశారు. గురువారం తన వాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల ని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు గందే విజయ్‌కుమార్, ఆదిలాబాద్ జిల్లా సీనియర్ నాయకులు అల్లూరి నారాయణరెడ్డి బీజేపీ అధికార ప్రతినిధి సలేంద్ర శివయ్య ముదిరాజ్, బీజేపీ కిషన్ మోర్చా కార్యవర్గ సభ్యులు చింతలపల్లి సతీష్‌రెడ్డి, మహిళా నాయకులు పాల్గొన్నారు.

నిందితుడిని బహిరంగంగా ఉరి తీయాలి

గుడిహత్నూర్: కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాలోని జైనూర్‌లో ఆదివాసీ మహిళపై దాడి చేసి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన నిందితుడిని బహిరంగంగా ఉరి తీయాలని ఆదివాసీ సేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాయిసిడం జంగు పటేల్ గురువారం ప్రకటనలో ద్వారా ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. బాధిత మహిళకు ప్రభుత్వమే మెరుగైన వైద్యం అందించి తగు నష్ట పరిహారాన్ని చెల్లించి క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించాలని డిమాండ్‌చేశారు.

నిందితుడికి ఉరి శిక్ష విధించాలి

ఇచ్చోడ: జైనూర్ మండలంలో మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితులకు ఉరిశిక్ష విధించాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్‌చేశారు. గురువారం ఇచ్చోడ మండల కేంద్రంలోని కొమురంభీం భవనం వద్ద మేడిగూడ రాయిసెంటర్ ఆధ్వర్యంలో ఆదివాసి నాయకులు బంద్‌కు పిలుపునిచ్చారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటుచేసి విచారణ జరిపించాలన్నారు. నిందితులకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటి, అత్యాచారం కేసులు నమోదు చేసి ఉరిశిక్ష విధించాలని ఆదివాసి తొమ్మిది తెగల సంఘాలు నాయకులు డిమాండ్‌చేశారు.

జైనూర్ ఘటన నిందితున్ని కఠినంగా శిక్షించాలి

ఇంద్రవెల్లి: జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై హత్యచారయత్నానికి పాల్పడిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పిప్రి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూడాలని కోరారు.

గాదిగూడ మండలంలో 144 సెక్షన్

● పోలీసు శాఖ అధికారుల భారీ బందోబస్తు
● బీజేపీ నాయకులు అరెస్టు

నార్నూర్, సెప్టెంబరు5: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో జరిగిన ఘటనతో పోలీసులు నార్నూర్, గాదిగూడ మండలం 144 సెక్షన్‌ను అమలుచేశారు. దీంతో గుంపులుగా ప్రజలు ఉండొద్దని, ర్యాలీ ధర్నా చేయొద్దని సూచించారు. చట్టానికి వ్యతిరేకంగా నియమ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని నార్నూర్ ఏఎస్సై గంగారెడ్డి అన్నారు. మండల కేంద్రం స్థానిక గాంధీ చౌక్, తడిహత్నూర్ గ్రామం గాదిగూడ, లోకారి ప్రాంతాల దగ్గర పోలీసు సిబ్బందులతో భారీ బందోబస్తు నిర్వహించారు. బీజేపీ నాయకులు అరెస్టు బాధతురాలిని పరామర్శించడానికి వెళ్లే బీజేపీ నాయకులు అరెస్టు జైనూర్ మండలం ఆదివాసీ మహిళపై జరిగిన ఘటన సందర్భంగా బీజేపీ జిల్లా నాయకులు బిక్కురాథోడ్ మండల అధ్యక్షులు తొడసం బాబులాల్, రామ్నివాస్, ఆడేదేవివాస్, రవీందర్ వెళ్తుండగా వారిని అరెస్టుచేసి నార్నూర్ పీఎస్‌కు తరలించారు.

● ఇంద్రవెల్లిలో 144 సెక్షన్

ఇంద్రవెల్లి: జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగినదాడి నేపథ్యంలో కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలో 144సెక్షన్ విధించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ ఆధ్వర్యంలో పోలీసులు ముఖ్యమైన కూడళ్లవద్ద బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ఇందులో బీజేపీ మండల అధ్యక్షుడు అరెల్లి రాజలింగు, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు మరప రాజు, స్వచ్ఛ భారత్ జిల్లా కన్వీనర్ దీపక్‌సింగ్, షేకావత్, కనక తుకారం, మోరే దిలిప్, మాస్కే రాజవర్ధన్ ఉన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టిసారించాలి: డీఐఈవో

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 5: సమాజంలో చదువుకుంటేనే విలువ ఉంటుందని, అందుచేతనే విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ఆదిలాబాద్ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రవీందర్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్ ప్రభుత్వ జూనియర్ గర్ల్స్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ గణేష్ కుమార్, పలువురు లెక్చరర్లు పాల్గొన్నారు.

రాజకీయం వద్దు: ఖానాపూర్ ఎమ్మెల్యే



దండం పెడుతూ శాంతికి సహకరించాలని కోరుతున్న ఎమ్మెల్యే

ఉట్నూర్, సెప్టెంబరు5: జైనూర్‌లో చోటుచేసుకున్న ఘటనలు బాధాకరమని, ప్రతిపక్ష పార్టీలు రాజకీయం చేయకుండా సంయమనంతో ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కోరారు. గురువారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జైనూర్ ఘటన పట్ల చింతిస్తున్నామన్నారు. తప్పుచేసిన వారికి కఠిన శిక్ష పడుతుందన్నారు. ఘటనకు బాధ్యుడైన వ్యక్తిని ఇప్పటికే జైలుకు వెళ్లాడని, చట్టప్రకారం చర్యలు ఉంటాయని అన్నారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క, డీజీపీ, ఐజీలతో మాట్లాడి బాధ్యుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. బుధవారం జరిగిన హింసాత్మక ఘటనలు దురదృష్టకరమని, ఆదివాసులను ఇబ్బంది పెట్టేలా కుట్రలు జరిగాయని అన్నారు. కొన్ని రాజకీయ పార్టీలు జోక్యం చేసుకొని అధికార పార్టీ ఇబ్బందులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నాయని, రాయిసెంటర్ల పెద్దలు, గ్రామాల పటేళ్లు, ఆదివాసీ యువకులకు దండం పెట్టి వేడుకుంటున్నానని, ఎవరు స్వార్థ రాజకీయాల వారికి బలి కావద్దని సంయమనం పాటించి శాంతికి కృషి చేయాలని కోరారు. జైనూర్ ఘటనలకు ముందస్తు చర్యలు తీసుకోవడంలో కొమురంభీం జిల్లా ఎస్పీ, ఆసిఫాబాద్ డీఎస్పీలు విఫలమయ్యారని, డీఎస్పీ తన తప్పును ఒప్పుకోవాలన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 5: ఆదిలాబాద్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌ను గురువారం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన దాడి అమానుషమని అన్నారు. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఎమ్మెల్యేను గృహనిర్బంధం చేసి, ఆయన ఇంటి చుట్టూ పోలీసులు మోహరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇతర ప్రాంతాల్లో మహిళలపై అత్యాచారాలు జరిగితే గళమెత్తే ఓవైసీ సోదరులు ఆదివాసీ మహిళపై అమాయిత్యం జరిగితే ఎందుకుభిన్నంగా స్పందిస్తున్నారని ధ్వజమెత్తారు. జైనూర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేతో బీజేపీ నాయకులు ఉన్నారు.

అడుగడుగునా పోలీసుల తనిఖీలు

● ఆసిఫాబాద్ రూట్‌లో బస్సులు బంద్

ఉట్నూర్, సెప్టెంబరు5: ఉమ్మడి జిల్లాలోని జైనూర్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనల దృష్ట్యా అడుగడుగునా పోలీసుల తనిఖీలు ముమ్మరం అయ్యాయి. ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్ చౌరస్తాతో పాటు పూసిగూడ చౌరస్తాలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తూ ఆసిఫాబాద్ వైపు వాహనాలు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. ఆసిఫాబాద్ మార్గంలో ద్విచక్ర వాహనాలతో పాటు, కార్లు, జీపులు ఆటోలలో వెళ్లే ప్రజలను తనిఖీలు నిర్వహిస్తున్నారు. కేవలం నార్నూర్‌వైపు వెళ్లే వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. పూసిగూడ గాటు వద్దజైనూర్ వైపు వాహనాలను అనుమతించడంలేదు. ఉట్నూర్‌నుంచి ఆసిఫాబాద్ వెళ్లే బస్సులను సైతం నడవనీయక పోవడంతో ఉట్నూర్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోల నుంచి బస్సులను రద్దు చేశారు.

నేడు ఇచ్చోడ బంద్‌కు పిలుపు

ఇచ్చోడ, సెప్టెంబరు5: జైనూర్ ఘటనను నిరసిస్తూ నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ పలు సంఘాలు ఇచ్చోడ బంద్‌కు పిలుపునిచ్చారు. ఇచ్చోడ మార్కెట్ సంపూర్ణ బంద్‌కు అన్నిసంఘాల వారు మద్దతు తెలపాలని రాయిసెంటర్ సభ్యులు కోరారు.

అభివృద్ధి పనుల కోసం రూ.2.40 కోట్లు మంజూరు

● ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



ప్రొసీడింగ్ కాపీలను అందచేస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా, సెప్టెంబరు 5 : నియోజకవర్గ పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం గాను రూ.2.40 కోట్లు మంజూరైనట్లుగా ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం భైంసాలో సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు, అభివృద్ధి పనుల ప్రొసిడింగ్ కాపీలను అందచేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జీ మంత్రివర్యులు సీతక్కల దృష్టికి ఇక్కడి ప్రాంత సమస్యలు, అవసరమైన అభివృద్ధి పనులను తీసుకవెళ్లి పరిష్కరింప చేసేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్నామని తెలిపారు. ప్రాధాన్యాతననుసారం అభివృద్ధి పనులు చేపట్టేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరంచారు. అభివృద్ధి ఏకకాలంలో సాధ్యం కాదని, దశలవారీగా జరుగుందని పెర్కొన్నారు. కుల సంఘాల భవనాల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వీటితో పాటు సీసీ రోడ్లు,మురికి కాలువలు, రోడ్ల నిర్మాణం, మరమ్మత్తుల కోసం అధిక ప్రాధాన్యనిస్తున్నట్లుగా వివరించారు. ఆయా ప్రాంతాల్లోని ఆలయాల నిర్మాణాలకు, పునర్ నిర్మాణాలకు సంబంధించి బిల్లులు త్వరతిగతిన విడుదలయ్యేలా కృషి చేస్తున్నామని వివరించారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ ఆనంద్‌రావ్ పాటిల్‌తోపాటు పలువరు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని రాస్తారోకో




భైంసా- బాసర రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న దృశ్యం

ముథోల్, సెప్టెంబరు 5 : మండలంలోని సరస్వతీ నగర్ వద్ద భైంసా - బాసర రహదారిపై గురువారం తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు రాస్తారోకో నిర్వహించారు. గత కొన్ని రోజుల నుంచి గ్రామాల్లో మిషన్ భగీరథ నుంచి వాటర్‌సప్లై కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ఈ విషయం గురించి సంబంధిత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మిషన్ భగీరథ అధికారులు వచ్చే వరకు ఇక్కడి నుండి జరిగేది లేదని పట్టుబట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీవో శివ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని తమ సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే తహసీల్దార్ శ్రీకాంత్, ముథోల్ ఎస్సై సాయికిరణ్ సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళన కారులను సముదాయించడంతో సమస్య సద్దుమణిగింది.

నవసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● ఉపాధ్యాయ దినోత్సవంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 5 : నవసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకొని నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్నారు. రాధాకృష్ణన్‌ను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గత రెండేళ్లుగా పది ఫలితాల్లో జిల్లా అగ్రస్థానంలో నిలవడం హర్షణీయమన్నారు. ఉపాధ్యాయులను అభినందిస్తూ పలువురిని సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అధిక సంఖ్యలో విద్యార్థులను చేర్పించి నాణ్యమైన విద్యా బోధన చేయాలని ఆకాంక్షించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ... ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ప్రభుత్వం అన్ని మౌలిక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయ ఉన్నత పాఠశాలలో..



నిర్మల్ అర్బన్, సెప్టెంబరు 5 : మాజీ రాష్ట్రపతి, తత్వవేత్త, ఉపాధ్యాయుడు శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజు సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెప్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభను కనబరిచినటువంటి విద్యార్థిని విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. పాఠశాల జనరల్ సెక్రటరీ అయ్యన్నగారి భూమయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుడు సమాజానికి చేసినటువంటి సేవల గురించి ఉపాధ్యాయుడి గురుతర బాధ్యతను గురించి వివరించారు. అలాగే పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రెసిడెంట్ అంబారాణి, కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ట్రెజరర్ ఆడెపు సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఆమెడ కిషన్, ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



నర్సాపూర్ (జి)లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయులకు సన్మానం

నర్సాపూర్(జి), సెప్టెంబరు 5 : మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. సందర్భంగా జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన చాట్ల భూమేష్, సాయిని మోహన్ రావులను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.కిషన్‌రావు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు వారిని ఘనంగా సన్మానించారు.

ముథోల్ మండలంలో..



ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్న విద్యార్థులు

ముథోల్, సెప్టెంబరు 5 : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలతో పాటు రబింద్ర, అక్షర, శ్రీవిద్యా, ఫ్యూచర్ స్కూల్ ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించి స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. గురువులను విద్యార్థులు సన్మానించారు. అలాగే ముథోల్‌లో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పి.మోహన్‌రెడ్డి, కార్యదర్శి సాయన్న, ప్రిన్సిపాళ్లు ఆనంవార్ సాయినాథ్, సుభాష్ ప్రవీణ్, సంతోష్‌కుమార్, సారధి రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంటాల, సెప్టెంబరు, 5 : కుంటాల మండలంలోని ఆయా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. మండల కేంద్రం కుంటాల ఆదర్శ పాఠశాలతో పాటు శాంతినికేతన్ పాఠశాలలో, పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థిని, విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు.

వరద నీటిలో పడి ఒకరి మృతి

సారంగాపూర్, సెప్టెంబరు 5 : మండలంలోని బోరిగాం గ్రామానికి చెందిన మేకల దేవేందర్(30) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు వరదనీటిలో పడి మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత రెండు రోజుల క్రితం బోరిగాం నుండి నిర్మల్‌కు బైక్‌పై వెళ్లిన దేవేందర్ ఇంటికి తిరిగి రాకపోవడంతో పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడం వల్ల స్వర్ణవాగు వైపు గాలింపు చర్యలు చేపట్టడంతో గురువారం వరద నీటిలో దేవేందర్ మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. దీంతో ప్రమాదవశాత్తు వరద నీటిలో పడడంతో నీట మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు తెలిపారు.

వాహనాల తనిఖీలో పట్టుబడ్డ గంజాయి

● ఒక కిలో గంజాయి స్వాధీనం
● నిందితుల అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు


సారంగాపూర్, సెప్టెంబరు 5 : మండలంలోని చించోలి(బి) ఎక్స్ రోడ్ వద్ద గురువారం పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నట్లు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ... నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన ఆరిఫ్‌తో పాటు నిర్మల్ పట్టణానికి చెందిన ఇమ్రాన్‌లు మహారాష్ట్రలోని కిన్వట్ నుండి తక్కువ ధరకు తీసుకొచ్చి నిర్మల్ పరిసర ప్రాంతాలలో అమ్మడానికి ద్విచక్ర వాహనంపై తీసుకవస్తుండగా ద్విచక్ర వాహనాన్ని పట్టుకొని కిలో గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రిమాండ్‌కు పంపించడం జరిగిందన్నారు. నిషేధిత మత్తు పదార్థాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రామకృష్ణ, ఎస్సై శ్రీకాంత్, పోలీసులు ఉన్నారు.

నిధులు విడుదల చేయండి

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 5 : గ్రామపంచాయతీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచ్‌లు గురువారం అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన అదనపు కలెక్టర్ చెల్లింపుకు హామీ ఇచ్చారని తెలిపారు.

జైనూరు బాధితురాలికి న్యాయం చేయాలి

● బీజేపీ మహిళా మోర్చా సభ్యుల రాస్తారోకో



కాగజ్‌నగర్, సెప్టెంబరు 5: జైనూరులో గిరిజన మహిళపై జరిగిన అత్యాచార ఘటనపై వెంటనే న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం కాగజ్‌నగర్ లారీచౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా మోర్చా అధ్యకురాలు శ్రీదేవి, పట్టణ మహిళా అధ్యక్షురాలు చిప్ప మౌనిక మాట్లాడుతూ జైనూరులో గిరిజన మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని ఉరి తీయాలన్నారు. శిక్ష పడేంతవరకు తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు. ఆరునెలల క్రితం జైనూరులో అల్లర్లు జరిగినప్పటికీ పోలీసు యంత్రాంగం ఎందుకు అప్రమత్తంగా లేదన్నారు. రాస్తారోకో చేయటంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోవటంతో సీఐ శంకరయ్య, ఎస్సై సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో విరమింపజేశారు.

andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.1 ; కనిష్ఠం 25.3

ఆంధ్రజ్యోతి



ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

శుక్రవారం 6 సెప్టెంబరు 2024



» జిల్లాలో వినాయక మండపాల ఏర్పాటుకు మొదలైన దరఖాస్తులు

» మండపాలకు ఉచిత విద్యుత్‌ను ప్రకటించిన ప్రభుత్వం

» నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

» ఉత్సవాలపై ప్రత్యేక దృష్టిని సారించిన జిల్లా అధికారులు

ఆన్‌లైన్ అనుమతులు!

ఆదిలాబాద్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): గతంలో మాదిరిగానే ఈయేడు వినాయక విగ్రహ ప్రతిష్ఠాపనకు తప్పని సరిగా ఆన్‌లైన్ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే విధివిధానాలను ఖరారుచేస్తూ జిల్లాపోలీసులు ఆదేశాలను జారీచేశారు. దీంతో గణేష్ మండపాల నిర్వాహకులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు తీసుకునేందుకు దరఖాస్తులు చేసుకుంటున్నారు. సెప్టెంబరు 5వరకు జిల్లావ్యాప్తంగా 250 దరఖాస్తులు వచ్చినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. ఈనెల 7న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణం, గ్రామాల్లో గణేష్ మండపాలను ముస్తాబుచేసే పనిలో నిర్వాహకులు నిమగ్నమయ్యారు. ఈసారి గణేష్ ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. గతరెండు మూడేళ్లుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటేనే పోలీసులు అనుమతులను ఇస్తున్నారు. మీ సేవ కేంద్రాలలో పూర్తివివరాలతో ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకుంటే ఏ రోజుకు సంబంధించిన దరఖాస్తులు అదేరోజు పరిశీలించి అనుమతులను మంజూరు చేస్తున్నారు. విగ్రహాల ప్రతిష్ఠాపన నుంచి మొదలుకొని నిమజ్జనం వరకు అంతా నిబంధనల ప్రకారమే నిర్వహించుకోవాల్సి ఉంటుందని అధికారులు స్పష్టంచేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వెయ్యికి పైగా గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో ఆదిలాబాద్ పట్టణంలోనే ఎక్కువగా గణేష్ మండపాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే జిల్లా అధికారులు, నిర్వాహకులు, హిందూ ఉత్సవసమితి సభ్యులతో కలెక్టర్, ఎస్పీలు సమావేశాలను ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు.

• గణేష్ మండపాలకు కరెంట్ ఫ్రీ

మునుపెన్నడూ లేనివిధంగా ఈసారి గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ప్రభుత్వం ప్రకటన చేయడంతో గణేష్ మండపాల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ అడ్డగోలుగా విద్యుత్ వినియోగం చేయకుండా విద్యుత్‌శాఖ అధికారుల అనుమతితోనే కరెంట్ కనెక్షన్‌ను తీసుకోవాల్సి ఉంటుంది. ఏదో ఆదరబాదరగా కొండీలు వేసి విద్యుత్‌ను వినియోగించుకోవడం కుదరదని అధికారులు చెబుతున్నారు. స్థానిక అధికారికి సమాచారం ఇస్తే అన్నిరకాల జాగ్రత్తలతో విద్యుత్ కనెక్షన్‌ను ఇవ్వనున్నారు. అలాగే విగ్రహ ప్రతిష్ఠాపనకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు పోలీసులు ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. http://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలి. అనంతరం దరఖాస్తు ఫారాలతోపాటు ఇతరపత్రాలు, రశీదులను సమీప పోలీసుస్టేషన్‌లో అందజేయాల్సి ఉంటుంది. గణేష్ మండపాల లోకేషన్, రూట్‌మ్యాప్, ఇతర వివరాలను నమోదుచేయాలని సూచిస్తున్నారు. మండపాల నిర్వాహకులు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అలాగే నిబంధనల ప్రకారం గణేష్ మండపాలకు అనుమతి ఉంటేనే విద్యుత్‌ను సరఫరా చేసే అవకాశం ఉంటుంది.

• పోలీసుల నిఘా

వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు ప్రత్యేకనిఘాను సారించనున్నారు. గణేష్ మండపాలను జియోట్యాగింగ్ ద్వారా నిరంతర పర్యవేక్షణ చేయనున్నారు. మండపాల నిర్వాహకులు రక్షణగా ప్రత్యేక వాలంటీర్స్‌ను ఏర్పాటుచేసుకోవాలని సూచిస్తున్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసులు క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలను మొదలు పెట్టారు. ఆన్‌లైన్ దరఖాస్తులో మండపం ఏర్పాటుచేసే ప్రదేశం, నిమజ్జన తేదీ, ఊరేగింపు బయలుదేరే సమయం, మండపాన్ని ఏర్పాటుచేసే ప్రదేశం యొక్క ఓనర్ వివరాలు, వినాయక విగ్రహం ఎత్తు, మండపం ఎత్తుతదితర వివరాలను ఇవ్వాల్సి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. గణేష్ మండపాల వద్ద శోభా యాత్ర సమయంలోను నియమనిబంధనలతో నడుచుకోవాలని సూచి స్తున్నారు. మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. ఎలాంటి అత్యవసర సమయంలోనైనా జిల్లా పోలీసు యంత్రాంగం 24గంటల పాటు సేవలు అందించేందుకు సిద్ధమైంది. ఏదైనా సమస్య ఉంటే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. సమస్యాత్మక గణేష్ మండపాలను గుర్తిస్తూ నిర్వాహకులకు ముందస్తు అవగాహన కల్పిస్తున్నారు. మొత్తానికి వినాయక నిమజ్జనాన్ని శాంతియుతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు.

అనుమతులు తీసుకోవడం తప్పనిసరి

• గౌస్‌ఆలం, ఎస్పీ, ఆదిలాబాద్

వినాయక విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలి. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి. ప్రతీ మండపం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలి. మండపాల వద్ద ఏదైనా సమస్య వస్తే పోలీసులను సంప్రదించాలి. ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ఎక్కువగా ప్రాధాన్యతను ఇవ్వాలి. జిల్లావ్యాప్తంగా గణపతి నవరాత్రులు నిర్వహిస్తున్న మండపాల నిర్వాహకులు, కమిటీ సభ్యులు, కుల పెద్దలు పోలీసుల నియమ నిబంధనలు పాటించి ఉత్సవాలను నిర్వహించుకోవాలి.

రైతులను విస్మరించడం మంచిది కాదు

• మాజీ మంత్రి జోగురామన్న



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలు, వరదలకు పంటలు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు అండగా నిలవాల్సిందిపోయి ఎమ్మెల్యే పాయలశంకర్ మంత్రితో కలిసి పర్యటించడం సరైందికాదని మాజీ మంత్రి జోగురామన్న విమర్శించారు. గురువారం దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. సీసీఐ పరిశ్రమను సందర్శించే సమయం ఇది కాదన్నారు. సీసీఐని ప్రైవేట్ పరం చేసి కమిషన్లు దండుకునేందుకు ప్రయత్నాలుచేయడం మానుకోవాలన్నారు. గత ప్రభుత్వహయాంలో 5వేలకోట్లతో అభివృద్ధిని చేశామన్నారు. అవగాహన లేక ఎమ్మెల్యే మాట్లాడుతున్నారని విమర్శించారు. తన మాటలను వక్రీకరించడం మానేసి అవగాహన, అనుభవాన్ని పెంచుకుంటే మంచిదన్నారు. మంత్రి పర్యటించినా దెబ్బతిన్న పంటలను ఎక్కడా పరిశీలించ లేదన్నారు. రేణుక సిమెంట్ ఫ్యాక్టరీ భూ నిర్వాసితుల గురించి గతంలో గప్పాలు కొట్టిన ఎమ్మెల్యే ఇప్పుడు ఏం చేస్తున్నాడో చెప్పాలన్నారు. భూ నిర్వాసితులతో కలెక్టర్ వద్దకు వచ్చే దమ్ము ఎమ్మెల్యేకు ఉందా అని ప్రశ్నించారు. తమతో కలిసి వస్తే ఎకరాకు రూ.40లక్షల నష్ట పరిహారాన్ని ప్రభుత్వాన్ని డిమాండ్ చేద్దామన్నారు. ఆయనవెంట నారాయణ, రోకండ్ల రమేష్, పలువురు రైతులు తదితరులున్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

బోథ్, సెప్టెంబరు5: మండలంలోని కౌటా(బి) గ్రామంలో గురువారం పౌష్టికాహార ఆరోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ లలిత మాట్లాడుతూ గర్భిణీలు పౌష్టికాహారాన్ని తీసుకుంటే తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనిత, శాంత శ్రీ, అనితలతో పాటు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న భోజారెడ్డి

రైతులకు నష్ట పరిహారం అందించేందుకు కృషి

• డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి

భీంపూర్, సెప్టెంబరు 5: పెన్‌గంగా ప్రాంతం భారీగా పంట నష్టం జరిగిందని పరిహారం ఇప్పించేందుకు ప్రభుత్వంతో కృషి చేస్తానని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి హామీనిచ్చారు. గురువారం ఆయన కాంగ్రెస్ నాయకులు ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, బోథ్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌తో కలిసి భీంపూర్ మండల అర్లి(టి)లో వాడూర్ తదితర గ్రామాలు సందర్శించారు. పెన్‌గంగా ముంపుకు గురి అయిన పంట చేన్‌లను పరిశీలించారు. రుణమాఫీలో అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. ఆయనతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అశోక్, నాయకులు దాసరి రమేష్, మతీన్ పటేల్, అన్ను పటేల్, పెండేపు కృష్ణ, సుదర్శన్, రేణికుంట్ల శ్రీనివాస్, నరేష్ యాదవ్, మురళీ, షేక్ అఫ్రోజ్, మక్బూల్ తదితరులు ఉన్నారు.

'పెండింగ్ నిధులు విడుదల చేయండి'

నార్నూర్, సెప్టెంబరు5: గ్రామపంచాయతీ పరిధిలో ఎస్‌డీఎఫ్ ఎనర్జీస్‌లో భాగంగా గ్రామాల పనిచేసిన సీసీ డ్రైన్ నిధులను విడుదల చేయాలని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ఉర్వతే రూప్‌దేవ్ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలం పూసిగూడ జమడా గ్రామం వద్ద వారు మాట్లాడారు. తాము పదవిలో ఉన్నప్పుడు అప్పులు చేసి అభివృద్ధి పనులు చేయించామని అన్నారు. ప్రభుత్వం ఇప్పటివరకు పెండింగ్ నిధులు విడుదల చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే నిధులు విడుదల చేయాలని, లేనిపక్షంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. వారివెంట జమా మాజీ సర్పంచ్ రూప్‌దేవ్ రవి తదితరులు ఉన్నారు.

నేడు ఇంద్రవెల్లి బంద్

ఇంద్రవెల్లి, సెప్టెంబరు5: కొమురం భీమ్ జిల్లాలోని జైనూర్‌లో ఆదివాసీ మహిళపై జరిగిన దాడిని నిరసిస్తూ, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఇంద్రవెల్లి బంద్ చేపడుతున్నట్లు ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు గేడం భారత్ తెలిపారు. మండలకేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఘటనకు నిరసనగా శుక్రవారం ఇంద్రవెల్లి బంద్‌కు పిలుపు నిచ్చినట్లు తెలిపారు. బంద్‌ను ఆదివాసీ సంఘాల నాయకులు, ఆదివాసీలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జుగ్నాక్ భారత్, సోయం రాందాస్, గేడం ఉమేష్, ఆత్రం హనుమంతు, సోయం మురహరీ, భీంరావు, సోయం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

భోథ్, సెప్టెంబరు5: గణేష్ పండుగను ప్రజలంతా ఐకమత్యంతో జరుపుకోవాలని బోథ్ ఎస్సై ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని మరలపెల్లిలో గ్రామపెద్దలు యువకులతో కలిసి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని కోరారు. గొడవలకు దిగినవారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. గ్రామ పెద్దలు, యువజన సంఘాల వారితో కలిసి శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు ఎర్రప్ప, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సావర్గావ్‌లో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

పారిశుధ్య పనులను పరిశీలించిన జడ్పీ సీఈవో

తాంసి, సెప్టెంబరు 5: మండలంలోని ఆయా గ్రామాల్లో పారిశుధ్య పనులను జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి పరిశీలించారు. ఎక్కడికక్కడ పేరుకున్న చెత్తాచెదారాన్ని చూసి ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం తాంసి, సావర్గావ్, బండల నాగపూర్ తదితర గ్రామాలలో ఆయన పర్యటించారు. గ్రామాల్లో మురికి కాలువల నిర్మాణాలు సరిగ్గా లేకపోవడం చెత్తాచెదారం రోడ్లపైనే ఉండటం, పెంటకుప్పలు ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం అయినం దున వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని, ఈ విషయంలో అధికారులతోపాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ఆదేశించారు. సంబంధిత అధికారులు స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవలు చేయాలని సూచించారు. విధుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఎక్కడైనా పెంటకుప్పలు ఉంటే వెంటనే చర్యలు తీసుకుంటామని ఎంపీడీవోకు ఆదేశాలు జారీచేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన డిప్యూటీ సీఈవో

ఉట్నూర్: మండలంలో స్పెషల్ శానిటేషన్‌లో భాగంగా గ్రామపంచాయతీ కుమ్మరితండను జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ కళాందినిని, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాంప్రసాద్, మండల పంచాయతీ అధికారి మహేశ్‌కుమార్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో ప్రతీరోజు శానిటేషన్ కార్యక్రమాలు జరగాలని డ్రై డే ఫ్రైడే కార్యక్రమాలు నిర్వహించాలని, నెలలో మూడు సార్లు గ్రామ పంచాయతీ ఓ హెచ్ఎస్ఆర్ ట్యాంకులను కడగాలని, ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలని అన్నారు. ప్రజలు కూడా తమ తమ ఇండ్లను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి దీప తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

తాంసి, సెప్టెంబరు5: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ లక్ష్మీ గురువారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం పాలు, గుడ్లను తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే పౌష్టికాహారాన్ని పిల్లలకు, గర్భిణీలకు అందజేయాలని సూచించారు. ఆమెవెంట ఆర్ఐ రవీందర్, జూనియర్ అసిస్టెంట్ రాఘువేంద్ర ఉన్నారు.

జవహర్ నవోదయలో ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

• డీఈవో ప్రణీత

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 5: 2025 - 26 విద్యాసంవత్సరానికి జవహర్ నవోదయలో ఆరోతరగతి అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆదిలాబాద్ డీఈవో ప్రణీత పేర్కొన్నారు. ఎంపిక పరీక్ష ద్వారా ప్రవేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈనెల 16వ తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2025 జనవరి 18న పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చట్టాలపై అవగాహన కలిగిఉండాలి

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 5: ఆదిలాబాద్ పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల కళాశాల, పాఠశాలలో గురువారం డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు డీఎల్ఎస్ఏ కార్యదర్శి బి.సౌజన్య మాట్లాడుతూ విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గతనెల 22న వసతి గృహాన్ని సందర్శించి లోటుపాట్లను గుర్తించి సుమోటోగా కేసు నమోదు చేశామన్నారు. దీంతో వసతిగృహంలో కొన్ని సౌకర్యాలు వచ్చాయని, మిగతావాటికి కూడా కృషి చేస్తామన్నారు.

కూలిన ఇంటిపై కప్పు

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 5: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని పర్ధాన్ గూడ గ్రామంలో ఓ ఇంటిపై కప్పు కూలిపోయింది. బాధితులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని పర్ధాన్‌గూడ గ్రామానికి చెందిన గేడం హీరామాన్, కమలబాయి దంపతులు నిరుపేద కుటుంబం పూరి గుడిసెలో నివాసముంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంటిపైకప్పు తడిసిపోయి కుప్పకూలిపోయింది. ఈ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని కుటుంబీకులు తెలిపారు. కూలిపోయిన ఇంటిపైకప్పు అధికారులు పరిశీలించి ప్రభుత్వపరంగా ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



గర్ల్స్‌హైస్కూల్ పాఠశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న విద్యార్థిని



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే



బోథ్‌లో ఉపాధ్యాయులుగా విద్యార్థినులు

విద్యతోనే సమాజంలో గుర్తింపు

• గురుపూజోత్సవంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ • జిల్లావ్యాప్తంగా ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

ఉట్నూర్, సెప్టెంబరు 5: విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. గురువారం ఉట్నూర్ మండలకేంద్రంలోని పీఎంఆర్సీ భవనంలో ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా, ఇన్‌చార్జీ డీడీ జాదవ్‌వసంత్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవం వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా ఐటీడీఏ పీఓ ఖుష్బుగుప్తా అధికారులతో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. మనిషిని సమాజంలో ఓ గొప్ప స్థాయికి తీసుకెళ్లడానికి గురువులు చేస్తున్న కృషి మరవలేనిదన్నారు. అనేకమందిని డాక్టర్లుగా, ఇంజనీర్లుగా, శాస్త్రవేత్తలుగా, పోలీసులుగా, రాజకీయ నాయకులుగా, మేధావులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారన్నారు. తాను ఓ ఆశ్రమ పాఠశాలలో, రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుకొని ఎమ్మెల్యేగా ఎదగడానికి గురువులు అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటుపాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయదినోత్సవాన్ని పురస్కరించుకుని ఇచ్చోడ పీహెచ్‌సీలోని రోగులకు, చిన్నారులకు పండ్లు పంపిణీచేశారు. మైనారిటీ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులె ఉపాధ్యాయులై అలరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ్‌రావ్, మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్ సలీం, సన్‌షైన్ పాఠశాల కరస్పాండెంట్లు గణేష్, రాకేష్, సంజయ్ పాల్గొన్నారు.



పండ్లు పంపిణీ చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్ రూరల్: ఆదిలాబాద్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ కెమిస్ట్రీ లెక్చరర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అండ్ మోటివేషనల్ స్పీకర్ సల్లా విజయబాబు హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ చదువులను ఎన్నుకొని ఉన్నతమైన స్థానాలను అధిరోహించాలని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల వేషాధారణలో పాఠశాలలకు హాజరై సందడి చేశారు. అనంతరం విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించడం విశేషంగా ఆకట్టుకుంది.

గుడిహత్నూర్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠవాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సమాజంలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో టీచర్ల పాత్ర ఎంతో కీలకమని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.శివాజీ పేర్కొన్నారు.

బోథ్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వేదం పాఠశాల సరస్వతి శిశు మందిర్ మానం వెల్ఫేర్ సొసైటీలో నాగభూషణం పాఠశాలలో విజ్ఞాన్ పాఠశాలల సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని నిర్వహించి ఆయన జీవిత చరిత్రను ప్రధానోపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

బజార్‌హత్నూర్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ తమ పాఠశాలలో ఉపాధ్యాయులుగా మారి విధులు నిర్వర్తించారు. అన్నిరకాల పనులను వారే స్వయంగా నిర్వర్తించారు.